క్లుప్తంగా

నియామకం


నాగార్జునాచారి

గన్నేరువరం: ఇండియన్ బ్యాంక్ కరీంనగర్ జోన్ అప్రైజర్‌గా మండలకేంద్రం గన్నేరువరంకు చెందిన బ్యాంక్ అప్రైజర్ తిప్పర్తి నాగార్జునాచారి నియామకమయ్యారు. ఈ మేరకు హైదరాబాద్‌లో జోన్ అప్రైజర్స్ ఆదివారం సమావేశమై ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా నియామానికి సహకరించిన వారందరికి నాగార్జునాచారి కృతజ్ఞతలు తెలియజేశారు. పలువురు అప్రైజర్స్, గ్రామస్తులు అభినందించారు.

రెడ్డి సంఘం అధ్యక్షుడిగా దావు సంపత్ రెడ్డి


సంపత్‌రెడ్డిని సన్మానిస్తున్న నాయకులు

తిమ్మాపూర్: మండలంలోని రామకృష్ణకాలనీ రెడ్డి సంక్షేమ సంఘం నూతన కార్యవర్గాన్ని ఆదివారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా దావు సంపత్‌రెడ్డి, ఉపాధ్యక్షులుగా గుజ్జుల తిరుపతిరెడ్డి, వడాల శ్రీనివాస్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శిగా ఎడ్ల భూంరెడ్డి, కోశాధికారిగా సంది మోహన్‌రెడ్డి, సహాయ కార్యదర్శులుగా ఎన్నం మహేందర్‌రెడ్డి, దులుగుంటి చంద్రశేఖర్‌రెడ్డి, యూత్ అధ్యక్షుడిగా కొమ్మెర విజయేందర్‌రెడ్డి ఎన్నికయ్యారు. అధ్యక్షుడు సంపత్‌రెడ్డి మాట్లాడుతూ రెడ్డి సంక్షేమ సంఘం అభివృద్ధికి కృషి చేస్తానని తెలిపారు. నియామకానికి సహకరించినవారికి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్ మీసాల అంజయ్య, ఉపసర్పంచ్ గుజ్జుల ప్రణీత్‌రెడ్డి, సభ్యులు ఉన్నారు.

పాదుపు సంఘం అధ్యక్షుడిగా మాదన వీరయ్య


మాదన వీరయ్య

తిమ్మాపూర్: మండల కేంద్రంలో ఆదివారం ఉజ్వల పురుషుల పొదుపు సంఘం వార్షిక మహాసభ సమావేశం నిర్వహించారు. అర్హత గల సభ్యులు సంఘంలో చేరాలని సూచించారు. అనంతరం కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా గ్రామానికి చెందిన మాదన వీరయ్య, ఉపాధ్యక్షుడిగా జక్కుల రమేశ్, సభ్యులుగా మహేశ్‌చంద్ర, అంజిరెడ్డి, సంతోశ్‌రెడ్డి, వీరేందర్, మల్లేశం, రమేష్, శ్రీనివాస్, రాజు, నర్సయ్య, శ్రీనివాస్‌ను ఎన్నుకున్నారు. నూతన అధ్యక్షుడు వీరయ్య మాట్లాడుతూ.. సహకార సంఘం అభివృద్ధికి పాటుపడతానని సూచించారు. అనంతరం నూతన కార్యవర్గ సభ్యులను పలువురు సన్మానించారు.

పాడి కౌశిక్‌రెడ్డిని కలిసిన సర్పంచ్


పుష్పగుచ్ఛం అందిస్తున్న నీల కుమారస్వామి

వీణవంక: ఎమ్మెల్సీ, శాసన మండలి విప్ పాడి కౌశిక్‌రెడ్డిని వీణవంక సర్పంచ్ నీల కుమారస్వామి హైదరాబాద్‌లో మర్యాద పూర్వకంగా కలిశారు. ప్రభుత్వ విప్‌గా బాధ్యతలు స్వీకరించిన సందర్భంగా శాలువాతో సన్మనించారు. అనంతరం వీణవంకలో చేపట్టిన అభివృద్ధి విషయాలపై ఎమ్మెల్సీతో చర్చించారు. ఇటీవల ప్రారంభించిన వారసంతకు మంచి స్పందన వస్తుందని ఎమ్మెల్సీకి వివరించామని సర్పంచ్ తెలిపారు. వెంట నీల పున్నంచందర్ తదితరులు ఉన్నారు.

రోడ్ల నిర్మాణానికి నిధులు



చిగురుమామిడి: మండలంలోని ముదిమాణిక్యం నుంచి ఇందుర్తి క్రాస్‌రోడ్డు వరకు తారురోడ్డు నిర్మాణానికి నిధులు మంజూరయ్యాయని హుస్నాబాద్ ఎమ్మెల్యే వొడితెల సతీశ్‌కుమార్ తెలిపారు. ఏళ్లుగా ఎదురుచూస్తున్న రోడ్డుకు మోక్షం లభించడంతో ఆదివారం గ్రామస్తులు ఎమ్మెల్యే, సీఎం కేసీఆర్ చిత్రపటాలకు క్షీరాభిషేకం చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ రవీందర్, ఉపసర్పంచ్ శిరీషాప్రకాశ్, బీఆర్‌ఎస్ గ్రామశాఖ అధ్యక్షుడు రమేశ్, బీఆర్‌ఎస్ జిల్లా నాయకుడు కొత్త శ్రీనివాస్‌రెడ్డి, రైతుబంధు జిల్లా నాయకుడు కొమురయ్య, నాయకులు అచ్చ రవీందర్, నారాయణరెడ్డి, మాధవరెడ్డి, బాబు, రాజు, తదితరులు పాల్గొన్నారు.

సైదాపూర్: మండలంలోని సోమారం, గర్రెపల్లి నుంచి సైదాపూర్–మొలంగూర్ రోడ్డు వరకు, వెన్నంపల్లి నుంచి ఆరెపల్లి వరకు తారురోడ్డు నిర్మాణానికి నిధులు మంజూరయ్యాయని వెన్నంపల్లి సింగిల్ విండో చైర్మన్ బిల్లా వెంకట్‌రెడ్డి తెలిపారు. నిధులు మంజూరు చేయించిన ఎమ్మెల్యే సతీశ్‌కుమార్‌కు వెంకట్‌రెడ్డి, ఎంపీపీ ప్రభాకర్‌రెడ్డి, సర్పంచులు సుశీల, పాపయ్య కృతజ్ఞతలు తెలిపారు.

సేద్యంలో కొత్తపుంతలు

- డ్రోన్‌ల రాకతో తీరనున్న రైతుల కష్టాలు
- కూలీల కొరత, డబ్బు, సమయం ఆదా
- వ్యవసాయంలో డ్రోన్ల శకం!


డ్రోన్‌తో పురుగుల మందు స్ప్రేచేస్తూ.. రైతులకు అవగాహన కల్పిస్తున్న అధికారులు

హుజూరాబాద్‌రూరల్: వ్యవసాయం రోజురోజుకి సాంకేతిక విప్లవాలతో కొత్త పొంతలు తొక్కుతోంది. పంటల సాగులో రైతులకు ఖర్చులను తగ్గించేందుకు డ్రోన్ల వినియోగంపై వ్యవసాయాధికారులు సమగ్రంగా అవగాహన కల్పిస్తున్నారు. డ్రోన్ల వినియోగంతో రైతులకు బహుళ ప్రయోజనాలు కలగనున్నాయి. మండలంలోని 19 గ్రామ పంచాయతీలు, మున్సిపల్ పరిధిలోని 4 విలీన గ్రామాల్లో 27,710 ఎకరాల సాగుభూములున్నాయి. ఇందులో రైతులు సుమారు 23,240 ఎకరాల్లో వివిధ రకాల పంటలు సాగుచేస్తూ జీవిస్తున్నారు. ఇందులో 22,200 ఎకరాల్లో వరి, 410 ఎకరాల్లో మొక్కజొన్న, మిగితా ఎకరాల్లో కూరగాయలు, ఇతర పంటలు సాగుచేస్తున్నారు.

వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో క్షేత్ర ప్రదర్శనలు...

రైతులను సాంకేతిక రంగంవైపు అడుగులు వేసేలా వ్యవసాయ శాఖ దృష్టి సారించింది. ముఖ్యంగా రైతాంగం ఎదుర్కొంటున్న కూలీ సమస్య పరిష్కారానికి చర్యలు చేపట్టింది. కూలీల సమస్య అధిగమించడానికి డ్రోన్ల వినియోగంపై అవగాహన కల్పించేందుకు వ్యవసాయ శాఖ మండలంలోని రైతువేదిక క్లస్టర్ల పరిధిలో 20 ఎకరాల చొప్పున క్షేత్ర ప్రదర్శనలు ఏర్పాటుచేసి డ్రోన్ల వినియోగంపై అవగాహన కల్పిస్తున్నారు.

కూలీల కొరతకు చెక్... సమయం ఆదా...

డ్రోన్లతో పంటలకు ఎరువులు, పురుగు మందులు పిచికారీ చేయడం తేలిక. రైతులకు ఉపయోగపడేలా డ్రోన్లు అందుబాటులోకి వస్తున్నాయి. ఇవి గరిష్టంగా 20 లీటర్ల మందును మోసుకెళ్లగలవు. గంటకు ఎకరా చొప్పున రోజుకు సుమారు 10 ఎకరాల్లో మందును స్ప్రేచేస్తాయి. డ్రోన్ల వినియోగంతో కూలీల సమస్యకు పరిష్కారం లభించడంతో పాటు, సమయం ఆదా అవుతుంది. కూలీలు, రైతులు రోగాల భారిన పడకుండా ఉండేందుకు అవకాశం ఉంటుంది. వ్యవసాయంలో సాంకేతిక విప్లవానికి ముందు పంట సాగుచేసింది మొదలు చేతికందే వరకూ ఎన్నో ఆటుపోట్లు ఎదుర్కొనేవారు. పంటల్లో ఎరువులు, పురుగుల మందులను వేయాలంటే కూలీల సమస్యతో రైతులు తీవ్ర ఇబ్బందులు పడేవాళ్లు. కూలీ ఖర్చుతో పెట్టుబడి మరింత పెరుగుతుండటంతో రైతులు హైరానపడుతున్నారు. మండలంలోని చాలా గ్రామాల్లో యాసంగి, వానకాలం సీజన్ ఆరంభంలో కూలీలు దొరక్క, బీహార్, ఒరిస్సా రాష్ట్రాలకు చెందిన కూలీలతో పనులు చేయించుకునే వారు.

డ్రోన్ల కొనుగోలు ఖర్చు తగ్గిస్తే మేలు...

వ్యవసాయ రంగంలో రైతుల సమస్యలను పరిష్కారించేందుకు వస్తున్న డ్రోన్ల నిర్వహణ వ్యయం అధికంగా ఉండడంతో రైతులు కొనుగోలు చేసేందుకు ఆసక్తి చూపడం లేదు. ప్రస్తుతం డ్రోన్ల ఖరీదు రూ.10 లక్షలు ఉండగా, వాటిలో ఉపయోగించే బ్యాటరీల విలువ రూ. 60వేల పైచిలుకు ఉండడంతో రైతులు డ్రోన్ ఖరీదును చూసి అవాక్కైపోతున్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సంయుక్తంగా ముందుకు వచ్చి డ్రోన్లను రైతులకు రాయితీలపై అందిస్తే లబ్ధిచేకూరే అవకాశం ఉంది.

అవగాహన కల్పించాలి



డ్రోన్ల వినియోగంతో కలిగే ప్రయోజనాలపై రైతులకు వ్యవసాయాధికారులు అవగాహన కల్పించాలి. కూలీల కొరత, ఎరువులు, పురుగు మందులు పిచికారీ చేయాలంటే సమయం ఎక్కువ పడుతోంది. డ్రోన్ల నిర్వహణ, ఉపయోగించే విధానం గురించి అవగాహన కల్పించాలి.

– వంగాల వెంకట్‌రెడ్డి, రైతు, సిర్సపల్లి

రాయితీపై అందిస్తే మేలు...



రైతుల సౌకర్యార్థం వస్తున్న డ్రోన్లను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రాయితీపై అందిస్తే ప్రయోజనం చేకూరుతుంది. ఎకరం మూడు ఎకరాల్లోపు రైతులు అధిక ఖర్చు వెచ్చించి డ్రోన్లను కొనుగోలు చేయాలంటే ఇబ్బందులు పడే అవకాశం ఉంది. రాయితీపై డ్రోన్లను అందిస్తే ఉపయోగకరం.

– నిమ్మ తిరుపతి, రైతు, ధర్మరాజుపల్లి.

ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంపై రైతులకు అవగాహన



మండల రైతాంగానికి ఆదునిక సంకేతిక పరిజ్ఞానంపై అవగాహన కల్పిస్తున్నాం. రోజురోజుకు పెరుగుతున్న కూలీల కొరత అధికమవుతున్న సమయంలో పురుగు మందుల స్ప్రే డ్రోన్ల వాడకం ఎంతో అవసరం. ఎరువులు చల్లడానికి, శ్రమ, శక్తిని, డబ్బు ఆదా చేసుకునేందుకు ఇవి ఎంతగానో ఉపయోగపడతాయి. అంతేకాకుండా తక్కువ సమయంలో ఎక్కువ విస్తీర్ణంలో మందులు చల్లడానికి ఉపయోగపడుతుండడంతో ఇవి ఎక్కువ మందిని ఆకర్షిస్తున్నాయి.

– చందుపట్ల సునీల్‌కుమార్, ఏవో, హుజూరాబాద్

పోస్టర్ ఆవిష్కరణ


పోస్టర్ ఆవిష్కరిస్తున్న ఉద్యమకారులు, ఆటోడ్రైవర్లు

శంకరపట్నం: మండలంలోని కేశవపట్నంలో ఆదివారం తెలంగాణ ఉద్యమకారుల ఆత్మగౌరవ సదస్సు పోస్టర్‌ను ఉద్యమకారులు, ఆటోడ్రైవర్లు ఆవిష్కరించారు. ఈ నెల12న హైదరాబాద్‌లో నిర్వహించే సదస్సుకు తరలిరావాలని ఉద్యమకారుడు చెరుకు వెంకటేశం కోరారు. కార్యక్రమంలో శ్రీనివాస్, తిరుపతి,కుమార్ తదితరులు ఉన్నారు.

వైఎస్సార్‌టీపీలో చేరిక


వైఎస్సార్‌టీపీలో చేరిన మహిళలు

చొప్పదండి: వైఎస్సార్‌టీపీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల పోరాటలకు మద్దతు ఇస్తామని పార్టీ చొప్పదండి నియోజకవర్గ ఇన్‌చార్జి తడగొండ సత్యరాజ్‌వర్మ అన్నారు. మండలంలోని ఆర్నకొండ వైఎస్సార్ విగ్రహం ఎదుట ఆదివారం షర్మిలకు మద్దతు ఇస్తామని పార్టీ కార్యకర్తలు ప్రతిజ్ఞ చేశారు. అనంతరం పలువురు మహిళలు పార్టీలో చేరగా ఆయన కండువాలు వైఎస్సార్‌టీపీలోకి ఆహ్వానించారు. ఈసందర్భంగా మాట్లాడుతూ... మార్చి 31లోగా బూత్‌కమిటీల నియామకం పూర్తి చేస్తామని, ఈ నెల 30న గంగాధరలోని శుభమస్తు గార్డెన్‌లో ఆరు మండలాల కార్యకర్తలు, అభిమానులతో భారీ బహిరంగర సభ ఏర్పాటు చేయనున్నామని చెప్పారు. కార్యక్రమంలో మహిళా నాయకురాలు గాదె స్రవంతి, మండల శాఖ అధ్యక్షుడు సింగిరెడ్డి రాజేందర్ రెడ్డి, పట్టణ శాఖ అధ్యక్షుడు గుర్రం మధు, పల్లెల రాజమౌళి, నేరెళ్ళస్వామి, గాదె శ్రీనివాస్, నాగయ్య, తదితరులు పాల్గొన్నారు.

కరాటే పోటీల్లో విద్యార్థుల ప్రతిభ


జమ్మికుంట: విద్యార్థులను అభినందిస్తున్న ఎమ్మెల్యే

శంకరపట్నం: హనుమకొండ జిల్లా పరకాలలో ఆదివారం నిర్వహించిన 31వ ఇంటర్ స్టేట్ ఓపెన్ కరాటే పోటీల్లో మండలంలోని కాచాపూర్ గ్రామానికి చెందిన సన్నిహిత కటాస్ సీనియర్ విభాగంలో బంగారు పతకం సాధించినట్లు కరాటే మాస్టర్ జలీల్ తెలిపారు.

జమ్మికుంట: జమ్మికుంట డ్రాగన్ స్కూల్ ఆఫ్ మార్షల్ ఆర్ట్స్ ఇండియా విద్యార్థులు దాట్ల ఆదిత్య, దీమే అనిక్, రాం గుప్తాలు కటాస్ విభాగంలో గోల్డ్ మెడల్ సాధించగా , స్పారింగ్ విభాగంలో అనిక్, రామ్‌లు గోల్డ్ మెడల్స్, ఆదిత్య సిల్వర్ మెడల్ సాధించారు. పరకాల ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి ముఖ్య అతిథిగా హాజరై విద్యార్థులకు పతకాలు, సర్టిఫికెట్లు అందించారు. కార్యక్రమంలో కరాటే శిక్షకుడు సుంకరి యాదయ్య, నిర్వాహకులు పాల్గొన్నారు.

మహిళా సాధికారతకు ఉద్యమించాలి


చిగురుమామిడి: విజయను సన్మానిస్తున్న మహిళలు


కేశవపట్నంలో జెండా ఆవిష్కరణ

చిగురుమామిడి: మహిళా సాధికారత కోసం ఉద్యమించాలని సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యురాలు గూడెం లక్ష్మి అన్నారు. ఆదివారం చిగురుమామిడిలోని ముస్కురాజిరెడ్డి స్మారక భవనంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. చట్టసభల్లో మహిళలకు 50 శాతం రిజర్వేషన్ బిల్లు నేటికి ఆమోదం పొందడంలేదని, ప్రస్తుతం ఉన్న చట్టాలను మహిళలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ సందర్భంగా జానపద కళాకారిణి తేలు విజయ ఆలపించిన పాటలు ఆకట్టుకున్నాయి. అనంతరం ఆయా రంగాల్లో రాణించిన మహిళలను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో సర్పంచులు అందె స్వరూప, నాగెల్లి వకుళారెడ్డి, సిద్దిపేట జిల్లా మహిళా సమైఖ్య కార్యదర్శి గూడ పద్మ, రాకం అంజవ్వ, సీపీఐ మండల కార్యదర్శి నాగెల్లి లక్ష్మారెడ్డి, మాజీ జెడ్పీటీసీ అందె స్వామి, తదితరులు హాజరయ్యారు.

మహిళా సమైక్య జెండా ఆవిష్కరణ

శంకరపట్నం:అంతర్జాతీయమహిళాదినోత్సవం పురస్కరించుకుని కేశవపట్నంలో ఆదివారం మహిళా సమైఖ్య జెండాను జిల్లా అధ్యక్షురాలు కిన్నెర మల్లవ్వ ఆవిష్కరించారు. మహిళా సమస్యలపై పోరాటం చేయాలని సూచించారు. వైద్య విద్యార్థిని ప్రీతి మృతిపై సంతాపం తెలిపారు. మహిళలపై జరుగుతున్న దాడులు, హత్యాచారాలకు వ్యతిరేకంగా పోరాడాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సీపీఐ మండల కార్యదర్శి పిట్టల సమ్మయ్య, కన్నం సదానందం, అంజలి, రాజేశ్వరి, పద్మ, స్వరూప, రమ, లక్ష్మి పాల్గొన్నారు.

ధ్యానంతో మానసిక ప్రశాంతత



ఇల్లందకుంట: ఇల్లందకుంట రామ సాయి వృద్ధాశ్రమంలో ఆదివారం ఆధ్యాత్మిక యోగ కార్యక్రమం జమ్మికుంట ప్రజాపిత బ్రహ్మకుమారి ఈశ్వరీయ విద్యాలయం ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రజాపిత బ్రహ్మకుమారి నిర్వాహకులు దీదీ నిర్మల మాట్లాడుతూ... ధ్యానంతో మానసిక ప్రశాంతత చేకూరుతుందని, నిత్యజీవితంలో సద్గుణాలతో మనసును నిండుగా ఉంచుకోవాలని, ధర్మం, సత్యం, న్యాయం, నీతి, నిజాయితీ, శాంతి, సంతోషంగా ఉండాలన్నారు. వృద్ధాశ్రమంలో యోగా ద్వారా శాంతి వాతావరణం పరివర్తనం చేశారు. కార్యక్రమంలో హుజూరాబాద్‌శాఖ నిర్వాహకులు ప్రణీత, బ్రహ్మకుమారీలు రవీందర్, లక్ష్మీనారాయణ, నిరంజన్, ఓంకారం రామయ్య, రమాదేవి, స్వరూప, సునీత, రాజిరెడ్డి, రాజమల్లు, ఆశ్రమ ప్రతినిధులు ప్రసాద్, ఆదిరెడ్డి, చందా విశ్వనాథం, బాబన్న, వెంకన్న తదితరులు పాల్గొన్నారు.



అ'పూర్వ' సమ్మేళనం

రామడుగు: మండలంలోని గుండి పాఠశాల 1987-88 విద్యా సంవత్సరం పదో తరగతి విద్యార్థులు ఆదివారం గోపాల్‌రావుపేట జిల్లా పరిషత్ పాఠశాల ఆవరణలో పూర్వ విద్యార్థుల సమ్మేళనం కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా చదువుకున్న రోజులనాటి జ్ఞాపకాలను నెమరువేసుకున్నారు. అనంతరం విద్యా బుద్ధులు నేర్పిన గురువులను సన్మానించారు.

ఆధ్యాత్మికం

వైభవంగా సుదర్శన హోమం

రామడుగు: మండలంలోని వెలిచాల గ్రామం శ్రీలక్ష్మీనరసింహస్వామి దేవాలయంలో స్వామివారి బ్రహోత్సవాల్లో భాగంగా ఆదివారం సుదర్శనహోమం వేదపండితుల ఆధ్వర్యంలో వైభవంగా నిర్వహించారు. ఈసందర్భంగా ప్రత్యేక పూజాకార్యక్రమాలు నిర్వహించారు. కార్యక్రమంలో దేవాలయాభివృద్ధి కమిటీ చైర్మన్ ప్రభాకర్‌రావు, సర్పంచ్ సరోజన, రైతుబంధు జిల్లా కమిటీ సభ్యులు వి.సంజీవరావు, రవీందర్‌రావు భక్తులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

ఘనంగా శివపార్వతుల కల్యాణం


తలంబ్రాలతో సర్పంచ్, ఎంపీటీసీ

తిమ్మాపూర్: మండలంలోని మొగిలిపాలెంలో శ్రీలక్ష్మీచెన్నకేశవస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఆదివారం శివపార్వతులు కల్యాణం వైభవంగా నిర్వహించారు. ఆనవాయితీ ప్రకారం దక్షిణ కాశీగా పిలవబడే వేములవాడ శ్రీరాజరాజేశ్వరస్వామి ఆలయం నుంచి ముత్యాల తలంబ్రాలు, పట్టు వస్త్రాలను జజాల మోహన్‌రావు సమర్పించారు. పదేళ్లగా శివపార్వతుల కల్యాణానికి వేములవాడ నుంచి తలంబ్రాలు, పట్టు వస్త్రాలు తీసుకొస్తున్నారు. మోహన్‌రావు తెచ్చిన పట్టు వస్త్రాలు, తలంబ్రాలను సర్పంచ్ మోరపల్లి సుస్మిత రెడ్డి, ఎంపీటీసీ పాశం తిలక్ ప్రియరెడ్డి, ఉప సర్పంచ్ కొమురయ్య స్వామివారికి సంప్రదాయబద్ధంగా సమర్పించారు. కార్యక్రమంలో మోరపల్లి రమణారెడ్డి, పాశం అశోక్ రెడ్డి, అర్చకులు,కమిటీ నిర్వాహకులు తదితరులు పాల్గొన్నారు

మొలంగూర్ శివాలయంలో...

శంకరపట్నం: మండలంలోని మొలంగూర్ శివాలయంలో అర్చకులు ఆదివారం లక్ష రుద్రాక్షర్చన కార్యక్రమం నిర్వహించారు. లక్ష రుద్రాక్షర్చన, పూర్ణాహుతి , మహాశీర్వాచనం వేదపండితులు భంగిమఠం నాగయ్య, గణాచారిమఠం సాంబశివరావు, శివప్రసాద్ జరిపించారు. కార్యక్రమంలో భక్తులు పాల్గొన్నారు.

నేటి నుంచి విగ్రహ ప్రతిష్ఠాపనోత్సవాలు


ముస్తాబైన సాయిబాబా ఆలయం

చొప్పదండి: పట్టణంలో నిర్మించిన సాయిబాబా ఆలయంలో సోమవారం నుంచి విగ్రహ ప్రతిష్ఠాపన ఉత్సవాలను నిర్వహించనున్నారు. ప్రధాన ఆలయంలో గణపతి, దత్తాత్రేయ, సాయిబాబా విగ్రహ ప్రతిష్ఠాపనకు ఆలయాన్ని సుందరంగా ముస్తాబు చేశారు. ఆలయ కార్య నిర్వాహక కమిటీ ఆధ్వర్యంలో సోమవారం శోభాయాత్ర, మంగళవారం గణపతి హోమం, బుధవారం చండీ హోమం, గురువారం ఉదయం విగ్రహ ప్రతిష్ఠాపన ఉంటుందని నిర్వాహకులు తెలిపారు. ప్రతిరోజు మధ్యాహ్నం ఆలయంలో అన్నదానం చేపడుతామన్నారు. పట్టణంలోని భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని విగ్రహ ప్రతిష్ఠాపన ఉత్సవాలను విజయవంతం చేయాలని కోరారు.

ఆర్థికసాయం అందజేత


ఆర్థికసాయం అందిస్తున్న విజేందర్‌రెడ్డి

గంగాధర: మండలంలోని గట్టుబూత్కూర్ గ్రామంలో అనారోగ్యంలో మృతి చెందిన సాంబార్ గట్టయ్య కుటుంబానికి, ముదుగంటి బాలు కూతురు వర్షితకు వైద్య చికిత్స కోసం రూ. ఐదువేల చొప్పున కొత్త జైపాల్‌రెడ్డి మిత్ర మండలి ఆధ్వర్యంలో సర్పంచ్ కంకణాల విజేందర్‌రెడ్డి ఆర్థికసాయం అందజేశారు.

జమ్మికుంట: మండలంలోని కోరపల్లి గ్రామానికి చెందిన తాళ్లపెల్లి అరవింద్‌గౌడ్ ఇటీవల మృతి చెందాడు. మృతుడి కుటుంబ సభ్యులకు ఆదివారం మిత్ర బృందం రూ. 21 వేల ఆర్థిక సాయం అందించారు. అనంతరం మిత్ర బృందం సభ్యులను గ్రామస్తులు అభినందించారు.

ముగిసిన క్రికెట్ టోర్నమెంట్


బహుమతి అందుకుంటున్న క్రీడాకారులు

జమ్మికుంట: ప్రభుత్వ డిగ్రీ కళాశాల మైదానంలో జెఎంపీఎల్ క్రికెట్ టోర్నమెంట్‌లో 10 జట్టు పోటీ పడగా గ్రాండ్ టీం జట్టు విజేతగా నిలిచింది. ఆదివారం సాయంత్రం జరిగిన ఫైనల్ మ్యాచ్‌లో నివాస్‌లెనిన్ జట్టుపై 11 పరుగుల తేడాతో విజయం సాధించింది. విజేతలకు టోర్నమెంట్ స్పాన్సర్, మాజీ సర్పంచ్ పొనగంటి మల్లయ్య ట్రోఫీతోపాటు ఐదువేల నగదు బహుమతిగా అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లో క్రీడాలపై ఆసక్తి పెంచేందుకు కేసీఆర్ ప్రభుత్వం క్రీడా ప్రాంగణాలను ఏర్పాటు చేస్తుందని, క్రీడాకారులు శారీరక ధృడత్వంతోపాటు ఆటల్లో నైపుణ్యం పెంపొందించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో రిటైర్డ్ ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు మోహన్‌రావు, మాధవరెడ్డి, క్రీడాకారులు గుల్లి ప్రతాప్, ఎం.రాజు, విక్కి ,రమేష్, శశి, శ్రీను, రాజు,సల్మాన్, మత్తు, రఘు పాల్గొన్నారు.

రామకృష్ణకాలనీలో వైద్య శిబిరం


పరీక్షలు చేస్తున్న వైద్యులు

తిమ్మాపూర్: ఇండియన్ మెడికల్ అసోసియేషన్, సంజీవని చారిటబుల్ ట్రస్ట్, హాస్పిటల్ ఆధ్వర్యంలో మండలంలోని రామకృష్ణ కాలనీ గ్రామ పంచాయతీ ఆవరణలో 'పల్లెకు పోదాం పదండి' పేరుతో ఆదివారం ఉచిత మెడికల్ క్యాంపు నిర్వహించారు. ఈసందర్భంగా గ్రామానికి చెందిన 250 మందికి వైద్య పరీక్షలు చేసిన అనంతరం ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ఈసందర్భంగా డాక్టర్ విజయలక్ష్మి మాట్లాడారు. రామకృష్ణకాలనీని దత్తత తీసుకుని రెండు నెలలకోసారి హెల్త్ క్యాంపు ఏర్పాటు చేసి గ్రామస్తులకు వివిధ రకాల పరీక్షలు చేసి ఉచితంగా మందులు పంపిణీ చేస్తున్నామని చెప్పారు. అలాగే అవసరమైన వారికి ఆపరేషన్లు చేస్తామన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ మీసాల అంజయ్య, ఉపసర్పంచ్ గుజ్జుల ప్రణీత్‌రెడ్డి, వైద్యులు నవీన్ కుమార్, శ్రవణ్‌కుమార్, రవి కాంత్, సైకాలజిస్ట్ శివ, జనరల్ ఫిజిషియన్ నిఖిల్, డెర్మటాలజిస్ట్ సంధ్య, కార్డియాలజిస్ట్ ప్రియాంక, సురేందర్‌రెడ్డి, వేణు తదితరులు ఉన్నారు.

ఆర్‌ఎంపీ, పీఎంపీలను ఆదుకోవాలి


మాట్లాడుతున్న కాండగట్ల శ్రీనివాసు

హుజూరాబాద్: గ్రామాల్లో ప్రజలకు మెరుగైన సేవలందిస్తున్న ఆర్‌ఎంపీలకు రాష్ట్ర ప్రభుత్వం నెలసరి ఉపాధి కల్పించాలని రాష్ట్ర ఆర్‌ఎంపీ–పీఎంపీ అసోసియేషన్ అధ్యక్షుడు కాండగట్ల శ్రీనివాస్ కోరారు. ఆదివారం పట్టణంలో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. ప్రజలకు తక్కువ ఖర్చుతో మెరుగైన సేవలందిస్తున్నా ఆర్‌ఎంపీ, పీఎంపీలను ఆర్థికంగా ఆదుకునేందుకు ప్రభుత్వం ముందుకు రావాలన్నారు. కార్పొరేట్ స్థాయిలో అనేక ఆసుపత్రులు ఉన్నా ప్రజలు మమ్మల్ని ఆశ్రయిస్తున్నారని పేర్కొన్నారు. కార్యక్రమంలో తెలంగాణ ఆర్‌ఎంపీ–పీఎంపీల సంఘం అధ్యక్షుడు కందగట్ల శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి చిలుకమారి శ్రీనివాస్, ఉపాధ్యక్షుడు మచ్చిక చందు, కన్నబోయిన తిరుపతి, ఎర్రొల్ల సదానందం, కోశాధికారి కమల్ సింగ్, సహాయ కార్యదర్శి రామరాజు, కృష్ణమూర్తి, ధనుంజయ్, పరమేశ్ పాల్గొన్నారు.